యువత సరైన దారిలో సాగాలి

రామచంద్రపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలాన్ని యువత అర్థం చేసుకుని సరైన దారిలో నడవాలని రిటైర్డ్ అధ్యాపకుడు పి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన అంబేడ్కర్ జయంత్యుత్సవం గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథి వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు.

సామాజిక ఉద్యమకారులను ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: మహాత్మా జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కందుకూరి వీరేశలింగం పంతులు, బాబూ జగ్జీవన్‌రామ్‌ల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ అన్నారు. దుగ్గుదుర్రు శివారు దూడల గరువు మండల పరిషత్ పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యాన సామాజిక ఉద్యమకారుల జయంత్యుత్సవాలు గురువారం నిర్వహించారు.

విద్యుత్తు సబ్ స్టేషన్ పరిశీలన

మండపేట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆ శాఖ ఎస్ఈ టీవీవీఎస్ఎన్ మూర్తి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 18.05 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తుండగా వచ్చే మే నెల నాటికి 21.05 మిలియన్ యూనిట్లకు విద్యుత్ వినియోగం అవసరం కానుందన్నారు. రామచంద్రపురం డీఈ దాట్ల శ్రీధర్‌వర్మ, ఏడీ జి.తిరుమలరావు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు



వెంటూరులో డ్వాక్రా సంఘాలకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

- అర్హులందరికీ వైఎస్సార్ ఆసరా
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని వెంటూరు, చెల్లూరు, పసలపూడి, మాచవరం గ్రామాల్లో గురువారం వైఎస్సార్ ఆసరా సమావేశాలు జరిగాయి. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన్న హామీల్లో ఇప్పటికే 98 శాతం హామీలు చేశారన్నారు. కుటుంబానికి ఆర్థిక క్రమశిక్షణ ఇచ్చే ఇల్లాలికి అండగా ఉండేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని క్రమం తప్పకుండా ఇప్పటి వరకూ మూడు విడతలుగా చిత్తశుద్ధితో ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి పైసా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఎంపీడీఓ డి.శ్రీనివాసు మాట్లాడుతూ ఆరు గ్రామాల్లో మూడు విడతల్లో రూ.23.67 కోట్లు డ్వాక్రా సంఘాలకు మంజూరు చేశామన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు చౌటుపల్లి చక్రవేణి, పిల్లి శారద, వాసంశెట్టి వెంకట్రావు, కడలి పద్మావతి, కత్తుల సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారువెంకటరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, ఆరిఫ్, కొవ్వూరి త్రినాథరెడ్డి, సత్తి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కుల రాజకీయాలు చేయవద్దు

ఎమ్మెల్యే వేగుళ్ల తీరుపై

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: వెదురుమూడిలో జరిగిన సంఘటనను ఆసరాగా చేసుకుని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కుల రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పసలపూడిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల రాజకీయాలు చేయడం ఎమ్మెల్యే వేగుళ్లకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన వేగుళ్ల అభద్రతా భావంతో అభూత కల్పనలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. జిల్లాలో శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి కుడుపూడి సూర్యనారాయణరావుకు, మాదిగ సామాజిక వర్గం నుంచి బొమ్మి ఇజ్రాయేల్‌ను ఎమ్మెల్సీగా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తాను మొదటి సారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి శెట్టిబలిజలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వెదురుమూడిలో తనకు సంబంధం లేని ఘటనలో ఎమ్మెల్యే వేగుళ్ల శెట్టిబలిజలకు, తనకు మధ్య అంతరాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అభివృద్ధే ప్రధాన అజెండాగా మార్చుకుని పాలన చేసిన తానేంటో రెండు నియోజకవర్గాల్లోని ప్రజలకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు నౌడు వెంకటరమణ, వుండమట్ల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేతలు పాలిక గోవిందు, పలివెల రామకృష్ణ, చోడె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తోట త్రిమూర్తులు బీసీల పక్షపాతి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తున్నారని, అది ఓర్చుకోలేని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయడం తగదని బీసీ సంఘాల నేతలు అన్నారు. పసలపూడిలో వైఎస్సార్ సీపీకి చెందిన శెట్టిబలిజ సంఘం నేతలు పాలిక రామకృష్ణ, పాలిక గోవిందు, చోడె వెంకటరమణలు ఎంపీపీ నౌడు వెంకటరమణతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మండపేట మున్సిపాలిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శెట్టిబలిజలను మున్సిపల్ వైస్ చైర్మన్‌ను చేసిన ఘనత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకే దక్కుతుందన్నారు.

ఇమాం అలీ వర్ధంతి

రామచంద్రపురం రూరల్: మహమ్మద్ ప్రవక్త సోదరుడు ఇమాం హజరత్ అలీ 1404వ వర్ధంతి కార్యక్రమాలను ద్రాక్షారామలో ముస్లింలు మూడు రోజుల పాటు నిండు శోకంతో నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం పంజాలో మజ్లిస్ అనంతరం నఖలే ముబారక్ (గుమ్మటం ఊరేగింపు) ఆగా వారి పంజా వరకూ నిర్వహించి, మాతం చేశారు.

ఘనంగా ధనమ్మ తల్లి తీర్థం



ధనమ్మ తల్లి ఆలయాల ఎదుట భక్తులతో కిటకిటలాడుతున్న కాకినాడ- కోటిపల్లి రోడ్డు

కాజులూరు: గొల్లపాలెం, కరప మండలం కొంగోడు గ్రామాల సరిహద్దున వెలసిన శ్రీ ధనమహాలక్ష్మి (ధనమ్మ తల్లి) అమ్మవారికి తీర్థం ఘనంగా జరిగింది. జాతర సందర్భంగా రెండు గ్రామాల్లోనూ బుధవారం రాత్రి కోల సంబరాలు, గారడీ, కోయ మేళాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు ప్రదర్శించారు. గురువారం వేకువ నుంచి ఆలయాల వద్ద జాతర నిర్వహించారు. కాకినాడ, రామచంద్రపురం, మండపేట, యానాం, కోటిపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ కాకినాడ – కోటిపల్లి రోడ్డులో కరప మండలం గొర్రిపూడి నుంచి కాజులూరు మండలం ఆర్యావటం వరకూ రహదారి భక్తులతో రద్దీగా మారింది. సుమారు 50 వేల మంది అమ్మవారిని దర్శించుకుని ఉంటారని అంచనా వేశారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాలను, పరిసర ప్రాంతాలను అందంగా అలంకరించారు. నిర్వాహక కమిటీతో పాటు గ్రామస్తులు, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన భక్తులకు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించారు. రాత్రి 8 గంటల నుంచి ఆలయాల వద్ద భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. కరప, గొల్లపాలెం, కోరంగి, ఇంద్రపాలెం, స్టేషన్ల నుంచి వచ్చిన పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి. జాతర నేపథ్యంలో ట్రాఫిక్‌ను గొల్లపాలెం పంచాయతీ వెనుక రహదారి నుంచి కొంగోడు మీదుగా గొర్రిపూడి వైపు మళ్లించారు.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలకు దూరంగా ఉంటూ మనిషి మానసిక ప్రశాంతత పొందగలుగుతారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధనమ్మతల్లి జాతర సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పేదల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, పార్టీ అభివృద్ధికి నిరంతరం పోరాడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు శక్తిని వ్వాల్సిందిగా అమ్మవారిని కోరుకున్నానన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, పార్టీ మండల బీసీ సెల్ నేత గుబ్బల ఏసురాజు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్'



సత్యవాడలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న తోగరు మూర్తి తదితరులు

కె.గంగవరం: మండలంలోని 26 గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూళ్ల, సత్యవాడ గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సచివాలయాల ఇన్‌చార్జి, నియోజకవర్గ కాపు నాయకుడు తోగరు మూర్తి పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని ఆయనన్నారు. సర్పంచ్‌లు సలాది సూర్యకళావతి, చిల్లే నాగేశ్వరరావు, పార్టీ నాయకులు సలాది సూర్యప్రకాష్, సలాది అర్జునరావు, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: 'ప్రజలకు మంచి చేశాం.. మరింత మేలు చేయడానికి జగనన్నకు మద్దతిస్తారా..' అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు అడుగుతూంటే.. 'మాకు మంచి జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మా భవిష్యత్ బాగుంటుంది. ఆయనే మా నమ్మకం.. ఆయనకే మా పూర్తి మద్దతు' అంటూ పల్లె ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఈ సన్నివేశాలు మండలంలోని పలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి.

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కేశవరంలో గురువారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, సచివాలయ కన్వీనర్లు బందెల సాయిరామ్, అద్దంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి సీఎం జగన్ కృషి

కపిలేశ్వరపురం: పల్లెల ప్రగతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. మండలంలో పడమర ఖండ్రిక, అంగర, మాచర, అద్దంకివారిలంక, కేదారిలంక తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలసి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. తమ ఇంటికి మంజూరైన లబ్ధి వివరాలను తెలుసుకున్న లబ్ధిదారులు మా నమ్మకం నువ్వే జగన్ అని రాసి ఉన్న స్టిక్కర్లను ఇంటికి అతికించుకున్నారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పడమర ఖండ్రిక గ్రామ అధ్యక్షుడు కవల శ్రీను, నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, కోలపల్లి గోపాలకృష్ణ, నేల సూర్యకుమార్ పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమమే లక్ష్యం

కాజులూరు: రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ, పేద కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కాజులూరు పీఏసీఎస్ చైర్మన్ సలాది నానాజీ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నాడు–నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ, పార్టీ నుంచి వచ్చిన ప్రశ్న పత్రంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాబడుతూ ప్రజాభిప్రాయం సేకరించారు. కాజులూరులో జరిగిన కార్యక్రమంలో నానాజీ మాట్లాడుతూ, ఇంటి ముంగిట్లోనే సంక్షేమం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

రామచంద్రపురం రూరల్: ఈ నెల 10న అనారోగ్యంతో మృతి చెందిన ద్రాక్షారామకు చెందిన మీర్ అస్కరి (38) కుటుంబానికి వైఎస్సార్ బీమా తొలి విడతగా మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు అందించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ చేతుల మీదుగా గురువారం ఈ మొత్తం అందజేశారు.

నేడు పలు ప్రారంభోత్సవాలు

మండపేట: మెర్నిపాడులో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించనున్నట్టు సర్పంచ్ సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకుడు అశోక్ కుమార్ తెలిపారు. బీసీ కాలనీలో రూ.17.10 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రహదారులు, 3 డ్రైన్లు, రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, ఆర్‌బీకే గోదాములను ప్రారంభించనున్నారు.

వలంటీర్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

రామచంద్రపురం రూరల్: వెల్లలో 3 వలంటీర్ పోస్టుల ఖాళీల భర్తీకి జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు గురువారం తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన అదే గ్రామానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మృతి

మండపేట: పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇనుమర్తి వీరసుభద్ర (84) గురువారం మృతి చెందారు. ఆమె మృతికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సంతాపం తెలిపారు.